# ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం

## 8వ రాష్ట్ర మహాసభలు

**1993 డిసెంబర్**

**11,12,13**

## కర్నూలు



**నర్రా ప్రభాకరరెడ్డి నగర్**

లక్ష్మీ నరసింహస్వామి
కళ్యాణమండపం, మార్కెట్,
పాత బస్టాండ్ దగ్గర

ప్రజలారా!

దేశ ప్రధాన మంత్రిసీ రాష్ట్ర ముఖ్యమంత్రిసీ ప్రజలు తమ ప్రమేయం పెద్దగా లేకుండ 'ఎన్నుకున్న' కర్నూలు జిల్లా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం తన 8వ రాష్ట్ర మహాసభలు జరుపుకుంటూ ఉంది. పౌరహక్కుల రక్షణ కోసం, సాధన కోసం 20ఏళ్లుగా చేసిన కృషిని సమీక్షించుకుంటూ ఉంది.

పౌరహక్కుల ఉల్లంఘన కాకతాళీయంగా జరగడం లేదనీ, దేశ సామాజిక ఆర్థిక రాజకీయ వ్యవస్థలోనే దానికి మూలం ఉందనీ పౌరహక్కుల ఉద్యమం భావిస్తుంది. లాకప్పు హత్యలు, స్త్రీలపైన ఇంటాబయటా హింస, రాజకీయ ఉద్యమాలపైన అణచివేత, దళితులపైన అగ్రకులాల దాడులు, కార్మికుల హక్కుల నిరాకరణ, మైనారిటీల మనుగడపైనా హక్కులపైనా హిందూ మతోన్మాదుల దాడులు, అడవులలో ఆదివాసీల హక్కుల తిరస్కరణ, వాక్ సభాస్వాతంత్రాల పైన దాడి మొదలయిన పౌరహక్కుల సమస్యల గురించి ఎపిసిఎల్‌సి తన పరిధిలో ఆందోళన చేస్తూ ఉంది. ప్రభుత్వ పారిశ్రామిక ఆర్థిక విధానాలూ వైఫల్యాలూ ప్రజల జీవితాన్నీ జీవనాన్నీ ఆరోగ్యాన్నీ ధ్వంసం చేస్తున్న తీరుపట్ల తన నిరసన వ్యక్తం చేస్తూ ఉంది. కాలుష్యం చావులనూ ఆకలిచావులనూ అప్పుల చావులనూ ఎండగడుతూ ఉంది.

నాలుగు దశాబ్దాలకు పైగా అమలవుతున్న వ్యవస్థీకృతమైన అణచివేత ఈ మధ్య తీవ్ర రూపం తీసుకుంటూ ఉంది. తమహక్కుల విషయంలో పీడిత ప్రజలలో పెరుగుతున్న చైతన్యం దీనికి ఒక కారణం కాగా, గడచిన మూడేళ్లుగా దేశంలో అమలవుతున్న నూతన ఆర్థిక విధానం మరొక ముఖ్యమైన కారణం. ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, మూడవ ప్రపంచదేశాల మీద రుద్దుతున్న ఆర్థిక పునర్వ్యవస్థీకరణ ఆ దేశాల ఆర్థిక రంగాన్ని విదేశీ పెట్టుబడి ప్రవేశం కోసం సరళం చేస్తూనే ప్రజలపైన అణచివేతను మరింత కఠినం చేస్తుందనేది ఆసియా ఆఫ్రికా దక్షిణ అమెరికా మధ్య అమెరికాలలోని అనేక దేశాలు ఇప్పటికే అనుభవంలో తెలుసుకున్న సత్యం. మనం ఇప్పుడు అనుభవిస్తూ తెలుసుకుంటున్నాం.

ఆర్థిక పునర్వ్యవస్థీకరణలో భాగంగా దేశ ప్రభుత్వం తన సార్వభౌమత్వాన్ని ఏ మేరకు కోల్పోతుందో ఆ మేరకు పౌరులు ప్రజాస్వామ్యాన్ని కోల్పోతారు. ప్రభుత్వం ప్రజలకు జవాబుదారు కావడం ప్రజాస్వామ్యంలో ఒక ముఖ్యమయిన అంశం. ఆచరణలో ఈనాడు అది అసమగ్రంగా ఉంటే దానికోసం ప్రజలు పోరాడుతారు, పోరాడుతున్నారు. కానీ ప్రభుత్వం ప్రపంచ బ్యాంకుకు జవాబుదారయిన తరువాత ప్రజలకు జవాబుదారు కాలేదు. ప్రపంచబ్యాంకు మనకెట్లాగూ జవాబుదారు కాదు. మన ఆర్థిక భవితవ్యాన్ని నిర్ణయించే వాళ్లెవరూ మనకు జవాబుదారు కాకపోతే ఇంక ప్రజాస్వామ్యం ఎక్కడిది? దేశం దాకా ఎందుకు, తమ పొలాలమీద పశువుల మీద తమకుండే సార్వభౌమ అధికారాన్ని సహితం రైతులు డంకెల్ ప్రతిపాదన ఫలితంగా కోల్పోబోతున్నారు!

మనకు జవాబుదార్లు కానివాళ్లు నిర్ణయిస్తున్న మనదేశ భవితవ్యంలో ప్రజలకు హక్కులు లేవు, ప్రజలపట్ల ప్రభుత్వానికి ఎటువంటి బాధ్యత లేదు. 'సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయాన్ని' సాధించే బాధ్యతే కాదు, చదువు చెప్పే బాధ్యత లేదు, పని కల్పించే బాధ్యత లేదు, జీవనాధారం చూపించే బాధ్యత లేదు, వైద్య సదుపాయం కల్పించే బాధ్యత లేదు. ఏవయినా బాధ్యతలు ఉన్నాయని ఒకవేళ గుర్తించినా ప్రపంచబ్యాంకు శాసించే ద్రవ్య విధానాల ఫలితంగా వాటి కోసం ప్రభుత్వం దగ్గర డబ్బులు ఉండవు. మంచినీటి బోర్లకు, బలహీన వర్గాల ఇళ్లకు, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం దగ్గర డబ్బులుండవు. ద్రవ్యచలామణి మీద, బడ్జెట్ లోటు మీద అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు పెట్టే ఆంక్షల ఫలితం ఇది.

కొత్త హక్కులకే కాదు, ఇప్పటికి సాధించుకున్న హక్కులకు కూడ ఈ పునర్వ్యవస్థీకరణలో చోటు లేదు. కార్మికులు ఒక శతాబ్ద పోరాట కాలంలో సాధించుకున్న హక్కులను రాబోయే దినాలలో వేగంగా కోల్పోతారు. పాతపోరాటాలన్నీ తిరిగి ప్రారంభించవలసి ఉంటుంది. ప్రభుత్వ రంగంలో రిజర్వేషన్ల గురించి చర్చ ఇప్పుడిప్పుడే దేశంలో బలపడుతూ ఉంది. వెనుకబడిన కులాలకు, స్త్రీలకు రిజర్వేషన్ హక్కు ఇప్పుడిప్పుడే విస్తరిస్తూ ఉంది. అయితే ఈ దశలోనే నూతన ఆర్థిక విధానంలో భాగంగా పారిశ్రామిక ఆర్థిక రంగాలలో ప్రభుత్వప్రాధాన్యతను వేగంగా తగ్గించేస్తున్నారు. తత్ఫలితంగా రిజర్వేషన్ హక్కు వట్టి హుళక్కి కావడమేకాక, ప్రభుత్వ పాఠశాలలలో ఇప్పటిదాకా తక్కువ ఖర్చుతో లభ్యమయిన చదువు ప్రైవేటీకరణతో దూరమయ్యే కొద్దీ దళితుల హక్కులు, స్త్రీల హక్కులు వెనకడుగు వేసినట్టే.

అందువల్లనే నూతన ఆర్థిక విధానాన్నీ ఆర్థిక పునర్వ్యవస్థీకరణనూ ప్రజల హక్కులకు భంగకరమని పౌరహక్కుల ఉద్యమం వ్యతిరేకిస్తూ ఉంది.

హక్కులకూ సమాన అవకాశాలకూ సామాజిక న్యాయానికి చోటులేని ఈ పునర్వ్యవస్థీకరణకు తగినట్టు హక్కులకు తావేలేని బ్రాహ్మణీయ హిందుత్వాన్ని పునరుద్ధరించే ప్రయత్నం 'సంఘ్‌పరివార్' ఆధ్వర్యంలో, అధికార యంత్రాంగం లాలూచీతో, ముమ్మరంగా సాగుతూ ఉంది. గుళ్లపేరు చెప్పి దేవుళ్ల పేరు చెప్పి ముస్లింలపైన ద్వేషం రెచ్చగొట్టి అధికారానికి రాజూస్తున్న ఈ హిందూ మతోన్మాదం మైనారిటీల హక్కులను గుర్తించదు. మైనారిటీ అనే భావననే గుర్తించదు. మైనారిటీల హక్కులనే కాదు, ఏ ప్రజాస్వామ్య సూత్రాన్నీ ఇది మన్నించదు. భారత రాజ్యాంగానికి మూలసూత్రమైన 'సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయాన్ని' గౌరవించదు. మతోన్మాద రాజకీయాలను, ప్రత్యేకించి హిందుత్వవాద రాజకీయాలను ప్రజాస్వామ్యానికి శత్రువుగా గుర్తించి పౌరహక్కుల ఉద్యమం వ్యతిరేకిస్తూ ఉంది.

ఈ వాతావరణంలో ప్రజాఉద్యమాలపైన ప్రభుత్వ అణచివేత విపరీతంగా పెరుగుతూ ఉంది. చట్ట రూపంలో అణచివేతకు 'టాడా' సంకేతం అనుకుంటే కేంద్రప్రభుత్వ గణాంకాల ప్రకారమే దేశంలో 50వేల మందికి పైగా 'టాడా' ముద్దాయిలు ఉన్నారు. అయితే ఇది బహుశా చార్జిషీట్లలో పేర్కొన్న ముద్దాయిల సంఖ్య అయి ఉంటుంది. 'టాడా' క్రింద అరెస్టు చేసిన వారి సంఖ్య మొత్తం తీసుకుంటే 1 లక్షకు దగ్గరగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లోనే 12 వేలకు పైగా ఉందని ఎపిసిఎల్‌సి అంచనా. ఉద్యమకారులపైన 'టాడా' తో బాటు 'నాసా' చట్టాన్ని కూడ

తరచుగా ప్రయోగించి నిర్దిష్టమయిన
న్నారు. కార్మిక ఉద్యోగ ఉద్యమాలను
నిషేధిస్తున్నారు.

ఇదంతా చట్టం ఆమోదంతో
చట్టవిరుద్ధమయిన నిర్బంధానికి
మూడు ఏళ్లలో మనరాష్ట్రంలో
పోయాయి. ఈ మూడేళ్లలో ఇప్పటికి
'ఎన్‌కౌంటర్ల'లో హతమయ్యారు.
ఇంటినుండి తీసుకుపోయి తెల్లవారు
అత్యధిక భాగం సమాజంలో హక్కులు,
వర్గానికీ దళిత కులాలకు చెందిన వారే.
దేశంలో కనీసం సగభాగంలో ఈరోజు
'ఎన్‌కౌంటర్ల' పేరిట చంపుతున్నారు.
'ఎన్‌కౌంటర్'లో డజన్ల సంఖ్యలో జనం
ఊరేగింపు తీస్తున్న ప్రజలపైన
తీసిన సంఘటన కూడ హజ్రత్‌బాల్
జరిగింది.

ఈ నిర్బంధ కాండలో
ప్రాంతాలలో ప్రభుత్వం అనేక రాజకీయ
ప్రభుత్వం పీపుల్స్‌వార్ గ్రూపునూ,
నిషేధించింది. రాజకీయ ఉద్యమాలను
ద్వారా ఎదుర్కొనే పాలనానీతిలో
మంచిదో ఏది చెడ్డదో ప్రజలు
నిషే[illegible]ట్టాలు ఆ నిర్ణయం చేయడానికి
అంటుంది. రాజకీయ ఉద్యమాలు
పరిధిలో ఎదుర్కొంటూ వాటితో
చాలని పౌరహక్కుల ఉద్యమం

దేశంలో 'టాడా' ముద్దాయిల సంఖ్య (ఫిబ్రవరి 1993)

| రాష్ట్రం | సంఖ్య |
|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 5,614 |
| అరుణాచల్‌ప్రదేశ్ | 88 |
| అస్సాం | 10,779 |
| బీహార్ | 190 |
| గుజరాత్ | 14,094 |
| హర్యానా | 916 |
| హిమాచల్‌ప్రదేశ్ | 55 |
| జమ్ము-కాశ్మీర్ | 1,826 |
| కర్నాటక | 26 |
| మధ్యప్రదేశ్ | 103 |
| మహారాష్ట్ర | 1,125 |
| మణిపూర్ | 1,003 |
| పంజాబ్ | 14,457 |
| రాజస్థాన్ | 422 |
| తమిళనాడు | 147 |
| త్రిపుర | 47 |
| ఉత్తరప్రదేశ్ | 851 |
| పశ్చిమబెంగాల్ | 525 |
| మొత్తం | 52,268 |

☆ పి.యు.డి.ఆర్. 'లా లెస్ రోడ్స్' రిపోర్టు నుంచి.

(ఇవి అధికారికంగా కేంద్రప్రభుత్వం పార్లమెంటులో ప్రకటించిన గణాంకాలు. అయితే టాడా ముద్దాయిల సంఖ్య దీనికి కనీసం రెండు రెట్లు ఉందనేది ఆయా రాష్ట్రాల్లో పనిచేస్తున్న పౌరహక్కుల సంఘాల అభిప్రాయం. ఇవి బహుశా చార్జిషీటు పెట్టిన ముద్దాయిల సంఖ్య కావచ్చు)

నేరారోపణ లేకుండ నిర్బంధిస్తు
'ఎస్మా' క్రింద రివాజుగా

ప్రయోగించే నిర్బంధమయితే
సంకేతం 'ఎన్‌కౌంటర్'. గడచిన
'ఎన్‌కౌంటర్లు' విపరీతంగా పెరిగి
485 మంది రాష్ట్రంలో
వీరిలో అధిక భాగం అర్ధరాత్రి
జామున కాల్చి చంపబడ్డ వారే.
స్వేచ్ఛ స్వాతంత్రం లేని పేదరైతాంగ
ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు,
వివిధ రాజకీయ ఉద్యమకారులను
కాశ్మీర్‌లోనయితే ఒక్కొక్క
చస్తున్నారు. పూర్తిగా శాంతియుతంగా
కాల్పులు జరిపి నలభై ప్రాణాలు
సంక్షోభం సమయంలో కాశ్మీర్‌లో

భాగంగానే దేశంలోని వివిధ
సంస్థలను నిషేధించింది. మనరాష్ట్ర
ఆ పార్టీ అనుబంధ సంస్థలను
రాజకీయంగా ఎదుర్కోక అణచివేత
భాగమే ఈ నిషేధాలు. ఏ రాజకీయం
నిర్ణయించుకుంటారు తప్ప ప్రభుత్వ
వీలులేదని పౌరహక్కుల ఉద్యమం
చేపట్టే సాయుధ చర్యలను చట్ట
మౌలికంగా రాజకీయంగా వ్యవహరిం
అంటుంది.

సాయుధ పోరాట ఉద్యమాల పైనే కాదు, పూర్తిగా శాంతియుతంగా సాగుతున్న ఉద్యమాల పట్ల కూడ ప్రభుత్వ వైఖరి ఇదే విధంగా ఉంది. నిర్లక్ష్యం, ఉదాసీనత, వెక్కిరింత, 'కొన్నాళ్లయితే వాళ్ళేమానుకుంటారులే' అనే తిరస్కారం, చివరికి లాఠీల ప్రయోగం, కేసులు, జైళ్లు - సారావ్యతిరేక ఉద్యమం నుండి రెండు నెలలకు పైగా రాష్ట్రంలో సాగుతున్న లాయర్ల 'హైకోర్టు బెంచి' ఆందోళనదాకా అన్నిటి పట్ల ప్రభుత్వం వైఖరి ఇదే. లేకపోతే చుండూరు బాధితుల విషయంలో చేసినట్లు బూటకపు హామీలు ఇచ్చి ఆందోళన విరమింపచేయడం, తరువాత హామీల విషయం అడిగితే 'మేమెప్పుడు ఇచ్చాం?' అని ఎదురు ప్రశ్న వేయడం పాలకులు అలవాటు చేసుకున్నారు.

ఉద్యమాలపైన అణచివేతేకాక, సామాన్యప్రజలపైన నిత్యం పోలీసు దాడులు జరుగుతున్నాయి. రిక్షా కార్మికులు, బళ్లవాళ్లు, మురికి వాడలవాసులు ప్రతిరోజు పోలీసుల అణచివేత చవి చూస్తున్నారు. చిల్లర మల్లర కేసులలో అరెస్టయ్యే జనం లాకప్పులలో దెబ్బలు తట్టుకోలేక

| రాష్ట్రంలో పోలీసుల 'ఎన్‌కౌంటర్' రికార్డు | |
|---|---|
| సంవత్సరం | మృతులసంఖ్య |
| 1968 – 1977 | 350 (సుమారు) |
| 1980 | 7 |
| 1981 | 5 |
| 1982 | 4 |
| 1983 | 3 |
| 1984 | – |
| 1985 | 35 |
| 1986 | 20 |
| 1987 | 29 |
| 1988 | 61 |
| 1989 | 51 |
| 1990 | 20 |
| 1991 | 104 |
| 1992 | 256 |
| 1993 (నవంబర్ 20 నాటికి) | 125 |
| మొత్తం : | 1,070 |

చనిపోతున్నారు. పోలీసు కస్టడీ మరణాల విషయంలో 1993 రికార్డు స్థాపించబోతూ ఉంది. ఈ సంవత్సరం ఇప్పటికి 27 మంది పోలీసు కస్టడీలో చనిపోయారు. వీళ్లంతా పేదవాళ్లే, వెనుకబడిన కులాలకు చెందిన వారే. ఈ జనం నేరాలలోకి ఎందుకు నెట్టబడుతున్నారో ఆలోచించి ఆ పరిస్థితిని చక్కబెట్టడం ప్రభుత్వం బాధ్యత తప్ప కొట్టి చంపి తప్పుడు కథలు అల్లడం కాదు.

ప్రభుత్వపరంగా పెరుగుతున్న ఈ అణచివేతే కాక సామాజిక వ్యవస్థలోనూ అణచివేత, విలువల పతనం పెరుగుతున్నాయి. దళితులు సమానతను కోరుకున్నా, సమానగౌరవం కోరుకున్నా అగ్రకులాలు సహించలేక దాడులకు పాల్పడుతున్నారు. ఇది కేవలం గ్రామాలలోనే కాక పట్టణాలలో కాలేజీలలో ఆఫీసులలో కూడ జరుగుతూ ఉంది. గ్రామాలలో దళితులపైన అగ్రకులాల మారణకాండ చుండూరు వంటి పెద్ద సంఘటనల్లో ప్రముఖంగా వార్తల కెక్కింది కానీ ప్రాచుర్యం పొందని చిన్న స్థాయిలో అనేక హత్యా సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. చుండూరు తరువాత 31 మంది దళితులు మనరాష్ట్రంలో అగ్రకుల హింసాకాండలో హతమయ్యారు. ఇవి పత్రికల కెక్కిన సంఘటనలు మాత్రమే.

ఈ హింసాకాండను అరికట్టడం, దళితుల హక్కులను కాపాడడం, రాజ్యాంగం ప్రభుత్వంపైన పెట్టిన ప్రత్యేకమయిన బాధ్యత. ఆ బాధ్యతను నెరవేర్చడానికి ప్రభుత్వం ఏమీ చేయకపోగా జరుగుతున్న దాడులలో దోషులను శిక్షించడానికి సహితం ఆతృత చూపించడం లేదు.

మన సామాజిక వ్యవస్థలోని హింసవల్ల అందరికంటె ఎక్కువగా బలవన్మరణం పాలవుతున్నది స్త్రీలు. 1993 జనవరి నుంచి జూన్ దాకా మన రాష్ట్రంలో 1310 మంది వివాహిత స్త్రీలు కుటుంబం నాలుగు గోడల మధ్య బలవన్మరణం పాలయ్యారు. కొందరు ఆత్మహత్య చేసుకున్నారు. కొందరు హతమార్చబడ్డారు. కొందరు నిజమోకాదో తెలియని ప్రమాదాలలో చనిపోయారు. స్త్రీల పైన అమలవుతున్న లైంగిక హింస మాటకొస్తే అప్పుడప్పుడు పత్రికలలో వచ్చే వార్తలు తప్ప సమగ్రమైన గణాంకాలు కూడ లేవు. స్త్రీలపైన అమలయ్యే ఈ హింసను నివారించడానికి చాలా చట్టాలు ఉన్నాయి. కానీ అమలులో మట్టుకు ఎవ్వరికీ శ్రద్ధలేదు. సమాజానికీ లేదు, పోలీసులకూ కోర్టులకూ లేదు. అసలు ఈ హింసను ఒక నేరంగా చూసే వైఖరే ఇంకా అలవడలేదు.

తాను జారీ చేసిన చట్టాలకు తానే గండి కొట్టే వైఖరిని ప్రభుత్వం ఇతర విషయాలలోకూడ అవలంబిస్తుంది. ఆదివాసీల భూములు ఇతరుల చేతిలోకి పోకుండ నిషేధించే చట్టాలు మన రాష్ట్రంలో 1917 నుండి ఉన్నాయి. అయినా 80 శాతం ఆదివాసీల భూమి అన్యాక్రాంతం అయింది. ఇప్పుడు భూమి బదలాయింపు నిషేధ చట్టాలనే రద్దు చేసే ఆలోచన హైదరాబాద్ లో జరుగుతూ ఉంది.

పారిశ్రామిక కాలుష్యం మరొక ఉదాహరణ. రాష్ట్రంలో ఎక్కడ పరిశ్రమలు ఉన్నా వాటి చుట్టూ బ్రతికే నోరులేని జనం గాలికాలుష్యంతో నీటి కాలుష్యంతో తమ జీవనాన్నీ ఆరోగ్యాన్నీ కోల్పోతున్నారు. తాగునీరు, సాగునీరు కలుషితమవుతున్నాయి. ధూళివల్ల పంటలు పాడవుతున్నాయి. మనుషుల ఆరోగ్యం పాడవుతూ ఉంది. వీటిని నిరోధించడానికి పరిశ్రమ యజమానులు చేపట్టవలసిన చర్యలు చేపట్టరు. వాళ్ల మీద ప్రభుత్వం చట్ట పరంగా తీసుకోవలసిన చర్య తీసుకోదు. తన నిర్లక్ష్యానికి పరిహారంగా ప్రభుత్వం కనీసం బాధితులకు నష్ట పరిహారం కూడ ఇవ్వదు.

| రాష్ట్రంలో పోలీసుకస్టడీ మరణాలు 1984 – 1993 | |
|---|---|
| సంవత్సరం | మృతులు |
| 1984 | 24 |
| 1985 | 16 |
| 1986 | 20 |
| 1987 | 24 |
| 1988 | 20 |
| 1989 | 14 |
| 1990 | 12 |
| 1991 | 21 |
| 1992 | 24 |
| 1993 (నవంబర్ 20 నాటికి) | 27 |
| మొత్తం : | 202 |

తన నిర్లక్ష్యం ప్రస్ఫుటంగా ఉన్నప్పుడే బాధ్యతను అంగీకరించని ప్రభుత్వం ఇతర సందర్భాలలో అసలు ఒప్పుకోదు. మన రాష్ట్రంలో రాయలసీమ, దక్షిణ తెలంగాణా జిల్లాలను–అప్పుడప్పుడు ఇతర ప్రాంతాలను కూడా – పీడించే కరువుకు ప్రభుత్వం బాధ్యత చాలా ఉంది. కానీ ఆ బాధ్యతను ప్రభుత్వం ఒప్పుకోదు. కరువు నివారణ, లేక కరువు సహాయం తాను దయతలచి చేపట్టే సంక్షేమ చర్యలుగానే తప్ప తన బాధ్యతగా

## చుండూరు తరువాత –

ప్రకాశంజిల్లాలో ఎనిమిది మంది గుంటూరులో ఏడుగురు తూర్పుగోదావరిలో ఒకరు కడపలో ఒకరు అనంతపురంలో అయిదుగురు కర్నూలులో ఏడుగురు కరీంనగర్‌లో నలుగురు........మొత్తం 33 మంది దళితులు అగ్రకుల హింసాకాండలో మరణించారు.

(ఇవి పత్రికల దృష్టికీ, ప్రజాఉద్యమాల దృష్టికీ వచ్చిన ఘటనలు మాత్రమే)

ప్రజలకు పనిచూపించడం, పశువులకు మేత ఇవ్వడం, పల్లెలకు తాగునీరు సమకూర్చడం, నీటి వసతులు దీర్ఘకాలికంగా పెంపొందించడం తన బాధ్యతగా, ప్రజల హక్కుగా ప్రభుత్వం భావించదు. కరువు సహాయం పేరిట ఎంతోకొంత మంజూరు చేసి ఏవో బిల్లులు చూపించి అంతా దైవాధీనం వానలు పడకపోతే మనమేం చేస్తాం అని పెదవి విరుస్తుంది. పశువులు వేలసంఖ్యలో వధశాలకు పోయినా, మనుషులు లక్షల సంఖ్యలో పొట్టకూటి కోసం వలసపోయినా పైర్లే కాదు బోర్లు కూడ ఎండిపోయినా తనకేం పట్టనట్టు ప్రభుత్వం ఊరుకుంటుంది.

**స్త్రీల బలవన్మరణాలు (జనవరి – జూన్ 1993)**

| | | |
|---|---|---|
| అనంతపురం | – | 79 |
| కర్నూలు | – | 61 |
| కడప | – | 24 |
| చిత్తూరు | – | 41 |
| నెల్లూరు | – | 29 |
| ప్రకాశం | – | 54 |
| గుంటూరు | – | 70 |
| కృష్ణా | – | 75 |
| పశ్చిమగోదావరి | – | 82 |
| తూర్పుగోదావరి | – | 64 |
| విశాఖపట్నం | – | 80 |
| విజయనగరం | – | 10 |
| శ్రీకాకుళం | – | 15 |
| ఖమ్మం | – | 54 |
| వరంగల్ | – | 69 |
| నిజామాబాద్ | – | 38 |
| ఆదిలాబాద్ | – | 37 |
| కరీంనగర్ | – | 80 |
| మెదక్ | – | 56 |
| నల్గొండ | – | 42 |
| రంగారెడ్డి | – | 40 |
| మహబూబ్‌నగర్ | – | 59 |
| హైదరాబాద్ | – | 151 |
| | మొత్తం | 1310 |

అసలు పాలక రాజకీయాలలో ఏ ప్రజాస్వామ్య ప్రమాణాలు మిగిలాయని? పరిపాలన అంటే నాయకులు దేశాన్ని దోచుకొని ప్రజలను హింసించి తాము కోటీశ్వరులు కావడం అనే నిర్వచనం వచ్చింది. కర్నూలు జిల్లాలోను పొరుగున ఉన్న ఇతర రాయలసీమ జిల్లాల్లోను ఈ సంగతి ఇంకెక్కడా కనిపించనంత ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. బందిపోట్లకు ఎంత మాత్రం తీసిపోని సాయుధ ముఠానాయకులు రాజకీయ నాయకులయి గ్రామాలను పంచుకొని లూటీ చేస్తున్నారు. ప్రజల వోట్లు తామే గుద్దుకొని ప్రజాప్రతినిధులుగా చలామణి అవుతున్నారు. ప్రజల భూములు, ఆస్తులు, శ్రమ, సంపద యదేచ్ఛగా స్వంతం చేసుకొని అనుభవిస్తున్నారు. ప్రజలను చీల్చి కక్షలు పెట్టి లేదా ప్రజలలో ఉండే కక్షలను వాడుకొని తాము పబ్బం గడుపుకుంటున్నారు. ఎదిరించిన వాళ్లను, ప్రశ్నించిన వాళ్లను ముక్కలుగా నరికి హతమార్చి ఏకాలవలోనో పారేసి చేతులు దులుపుకుంటున్నారు. మళ్లీ ఎవరికి వాళ్లు 'మా రాయలసీమ ఇంతగా పతనమయ్యిందే' అని మీటింగులలో కన్నీళ్లు పెడుతున్నారు.

కర్నూలులోనూ పొరుగు జిల్లాల లోనూ ప్రస్ఫుటంగా కనిపించే ఈ రాజకీయ రౌడీయిజం దేశపాలక రాజకీయాలకు ప్రతీక. బహుశా ఆదర్శం కూడానేమో. నాయకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి పాతిపెట్టి దేశసంపదను దోచుకొని బ్రతుకుతున్నారు. దానిని పునరుజ్జీవింపజేసి ప్రజలచేతిలో పెట్టడం పౌరహక్కుల ఉద్యమం కర్తవ్యంగా ఏపిసిఎల్‌సి భావిస్తూ ఉంది.

ఒక్క రాజకీయ ప్రజాస్వామ్యమే కాదు, పైన పేర్కొన్న అనేక ప్రజాస్వామ్య విలువలు, హక్కులు అన్నీ కూడ వివిధ దేశ కాలాలలో పీడనకూ అణచివేతకూ గురయిన ప్రజలు పోరాటాలు చేసి సాధించుకున్నవి. రాజ్యాంగంలో, చట్టంలో ఉన్న ఒక్కొక్క హక్కు వెనక ఒక పోరాట చరిత్ర ఉంది. ఆ హక్కులు, విలువలన్నీ ఈ రోజు పెత్తందార్ల చేతిలో బందీలయి ఉన్నాయి. వాటిని సాధించుకున్న ప్రజలకు అవి ఉపయోగపడిన దానికంటె ఆ ప్రజలకు వ్యతిరేకంగా పెత్తందార్లకూ పీడకులకూ ఉపయోగపడిందే ఎక్కువ. వాటికి తిరిగి ప్రాణం పోసి పీడిత ప్రజల చేతిలో పెట్టడం తన కర్తవ్యంగా పౌరహక్కుల సంఘం భావిస్తున్నది.

ఈ కర్తవ్య సాధనలో అనేక మైలు రాళ్లు గడచి తన 8వ రాష్ట్ర మహాసభలను జరుపుకుంటున్న ఏపిసిఎల్‌సికి మద్దతును సహాయసహకారాలను ఇమ్మని మీకందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం. కలిసి ముందుకు పోదాం రమ్మని ప్రజాతంత్ర వాదులందరికీ ఆహ్వానం పలుకుతున్నాం.

నవంబర్ 20, 1993

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (APCLC)

మహాసభల ప్రారంభ సమావేశం : డిసెంబర్ 11 ఉదయం 10 గంటలకు

ప్రారంభోపన్యాసం : నందిత హక్సర్ (పౌరహక్కుల న్యాయవాది)

ముఖ్య అతిథి : జస్టిస్ సురేశ్ (బొంబాయి హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి)